క్లుప్తంగా

ఇంటింటికీ తాగునీరు



ఇంటింటికీ కుళాయిలను పరిశీలిస్తున్న ఈఓ చిన్నారావు

నరసన్నపేట: మేజరు పంచాయతీ నరసన్నపేటలోని శ్రీదేవినగర్‌లో జల్ జీవన్ మిషన్ పథకంలో భాగంగా ఇంటింటికీ కుళాయిలను ఆదివారం ప్రారంభించారు. ఇప్పటికే వీధిలో పైపులైన్ వేయగా ఆదివారం ట్యాప్‌లు బిగించి నీటిని సరఫరా చేశారు. మొత్తం 42 ఇళ్లకు కుళాయిలు వేసినట్లు ఈఓ సవర చిన్నారావు తెలిపారు. వీటిని సక్రమంగా వినియోగించుకోవాలన్నారు. శ్రీదేవినగర్ వాసులు ఆనందం వ్యక్తం చేస్తున్నారు.

స్పెషల్ డ్రైవ్..



బైక్‌ను తనిఖీ చేస్తున్న ఎస్‌ఐ మహమ్మద్ యాసిన్

పాతపట్నం: ద్విచక్ర వాహనదారుల నుంచి పెండింగ్ చలానాల వసూలు చేస్తున్నామని ఎస్‌ఐ మహమ్మద్ యాసిన్ అన్నారు. రాష్ట్ర సరిహద్దులోని పాతపట్నం ఆర్టీసీ కాంప్లెక్స్ వద్ద ఆదివారం సాయంత్రం స్పెషల్ డ్రైవ్ నిర్వహించారు. అతివేగం, హెల్మెట్ ధరించకపోవడం, ద్విచక్ర వాహనాలపై ఇద్దరికి మించి ప్రయాణించడం వంటి కారణాలతో కేసులు నమోదు చేస్తున్నామన్నారు. వాహనదారులు వివిధ కారణాల రీత్యా చలానాలు చెల్లించడం లేదన్నారు. పోలీసులు పాల్గొన్నారు.

అనాథకు సపర్యలు



అనాథకు సపర్యలు చేస్తున్న సాయి సేవకులు

పొందూరు: అనాథ (మతిస్థిమితం లేని వ్యక్తి)కి పొందూరు సత్యసాయి సేవా సమితి సభ్యులు ఆదివారం సపర్యలు చేశారు. జుత్తు తీయించి, షేవింగ్, స్నానం చేయించారు. నూతన వస్త్రాలను ధరింపజేశారు. అల్పాహారం ఇచ్చారు. ప్రతీ రోజు ఆహారం అందిస్తామని చెప్పారు. సేవా కార్యక్రమంలో సత్యసాయి సేవా సమితి సభ్యులు గుడ్ల సాయిరాజ్, జిల్లా ఐటీ కోఆర్డినేటర్ మండ సాయి ప్రశాంత్, బుగత శ్రావణ్‌కుమార్, రామక్రిష్ణ తదితరులు పాల్గొన్నారు.

ఎరువులు కేటాయించాలి



సూర్యనారాయణ, పీఏసీఎస్ మాజీ చైర్మన్, కొత్తూరు

కొత్తూరు: రైతు సేవా కేంద్రాలకు, పీఏసీఎస్‌లకు యూరియా, డీఏపీతోపాటు అన్ని రకాల ఎరువులను ప్రభుత్వం కేటాయించాలని కొత్తూరు మండలం పీఏసీఎస్ మాజీ చైర్మన్ చింతాడ సూర్యనారాయణ కోరారు. మండలంలోని కొన్ని రైతు సేవా కేంద్రాలకు మాత్రమే కేవలం యూరియా కేటాయించారని, మిగిలిన వాటికి కేటాయించాలేదన్నారు. పీఏసీఎస్‌లకు పూర్తిగా ఎరువులు కేటాయించకపోవడం దారుణమన్నారు. రైతులు ఎరువుల కోసం ప్రైవేట్ డీలర్లను ఆశ్రయిస్తున్నారన్నారు. ప్రైవేట్ డీలర్లు యూరియా, డీఏపీతో పలు రకాల ఎరువులను అదనంగా రూ.50 నుంచి రూ.100 వరకు విక్రయిస్తున్నారన్నారు. రైతులపై అదనపు భారం పడుతుందన్నారు.

కూలేందుకు సిద్ధంగా విద్యుత్ స్తంభం



తిమడాం వద్ద రోడ్డు వైపు వాలి ఉన్న విద్యుత్ స్తంభం

బూర్జ: మండలంలోని అన్నంపేట పంచాయతీ తిమడాం గ్రామంలో గల తిమడాం-సరుబుజ్జిలి నుంచి మదనాపురం రహదారి మధ్యలో ఉన్న విద్యుత్ స్తంభం కూలేందుకు సిద్ధంగా ఉంది. గత కొంతకాలం నుంచి రహదారి వైపు వాలి ఉండడంతో ప్రయాణికులు ఆందోళన చెందుతున్నారు. ఏ క్షణంలోనైనా రహదారిపై కూలిపోయే అవకాశం ఉందని గ్రామస్తులు ఆవేదన వ్యక్తం చస్తున్నారు. విద్యుత్ శాఖ సిబ్బంది దృష్టి సారించి స్తంభాన్ని తొలగించాలని గ్రామస్తులు కోరుతున్నారు.

విజ్ఞాన నిలయం



పాతపట్నం గ్రంథాలయంలో పుస్తకాల విభాగం



పాతపట్నం గ్రంథాలయంలో చదువుతున్న పాఠకులు

- కాంపిటేటీవ్ పుస్తకాలతో కొలువుదీరిన పాతపట్నం శాఖా గ్రంథాలయం
- వినియోగించుకుంటున్న నిరుద్యోగులు, విద్యార్థులు
- పాఠకులు కోరిన పుస్తకాలు సమకూరుస్తున్న గ్రంథాలయాధికారులు
- నేడు జాతీయ గ్రంథాలయ దినోత్సవం

పాతపట్నం: నిరుద్యోగ యువతకు పాతపట్నం శాఖా గ్రంథాలయం బాసటగా నిలుస్తుంది. ప్రస్తుతం ఉద్యోగం పొందాలంటే తప్పనిసరిగా ఇతరులతో పోటీ పడాల్సిందే. అందుకు ఎంతో ఖరీదైన పుస్తకాలు కొనుగోలు చేసి మరీ చదవాలి. ఇటువంటి పరిస్థితుల్లో నియోజకవర్గ కేంద్రంలోని శాఖాగ్రంథాలయం నిరుద్యోగులకు వరంగా మారింది. విద్యార్థులు, నిరుద్యోగుల భవిష్యత్‌కు గ్రంథాలయ సంస్థ వేలాది రూపాయలు ఖర్చు చేస్తూ అవసరమైన అన్ని కాంపిటేటీవ్ పుస్తకాలు సమకూరుస్తుంది. పాతపట్నం ప్రభుత్వ ఆస్పత్రి కూడలిలో ఉన్న శాఖా గ్రంథాలయంలో వివిధ రకాల పుస్తకాల సుమారు 8 వేల వరకు అందుబాటులోన్నాయి. వీటికి తోడు మరో వంద వరకు పుస్తకాలను గ్రంథాయాధికారి కాళ్ల రాజు సమకూర్చారు. వాటిలో పోటీ పరీక్షలు, భాషా సాహిత్యం, పురాణ గ్రంథాలు, గొప్ప వ్యక్తుల జీవిత చరిత్రలు, కాంపిటేటీవ్ పరీక్షకు సన్నద్ధమయ్యే యువతకు ఉపయోగపడే పుస్తకాలు అందుబాటులోన్నాయి. త్వరలో మరిన్ని పుస్తకాలు వస్తాయని నిర్వాహకులు తెలిపారు. ప్రతీ ఏడాది ఆగస్టు 12వ తేదీన జాతీయ గ్రంథాలయ దినోత్సవాన్నిగ్రంథాలయ పితామహుడు ఎస్.ఆర్. రంగనాథన్ పుట్టిన రోజున ఆయనకు గుర్తుగా నిర్వహిస్తున్నామన్నారు.

గ్రంథాలయం పని వేళలు..

ఉదయం 8 నుంచి 12 గంటల వరకు.. మధ్యాహ్నం 4 నుంచి 8 గంటల వరకు గ్రంథాలయం తెరిచి ఉంటుంది. ప్రధానంగా పోటీ పరీక్షలకు సన్నద్ధమయ్యే విద్యార్థులకు గ్రంథాలయం ఎంతో ఉపకరిస్తుంది. వివిధ రకాల పుస్తకాలను ఇంటికి తీసుకువెళ్లే సౌలభ్యం కూడా కల్పిస్తున్నారు.

మరిన్ని పుస్తకాలు..



అవసరాన్ని బట్టి మరిన్ని పుస్తకాలు సమకూర్చుతాం. ఇప్పటికే గ్రంథాలయంలో సుమారు 8 వేల వరకు పుస్తకాలు అందుబాటులో ఉన్నాయి. విద్యార్థులు, కాంపిటేటీవ్ పరీక్షలకు హాజరయ్యే విద్యార్థులకు అవసరమైన విలువైన పుస్తకాలున్నాయి.

– కాళ్ల రాజు, శాఖా గ్రంథాలయాధికారి, పాతపట్నం

పేపర్లన్నీ అందుబాటులో ఉంటాయి



శాఖా గ్రంథాలయంలో అన్ని రకాల దిన, వార, మాస పత్రికలు అందుబాటులో ఉంటున్నాయి. పిల్లలు, పెద్దలు వినియోగించే పుస్తకాలు కూడా ఉన్నాయి. గ్రంథాలయాన్ని అందరూ సద్వినియోగం చేసుకుని విజ్ఞానం పెంపొందించుకోవాలి.

– జి.రామారావు, సింగుపురం గ్రామం, పాతపట్నం

పోటీ పరీక్షల మెటీరియల్ ఉంది



పోటీ పరీక్షలకు ప్రిపేర్ అవుతున్నాం. అందుకు కావాల్సిన మెటీరియల్ గ్రంథాలయంలో అందుబాటులో ఉంది. నిర్వాహకులు తీరుతో గ్రంథాలయం వాతావరణం చాలా బాగుంది. సిబ్బంది సహరిస్తున్నారు.

– వై.ప్రవీణ్, ఉప్పరవీధి, పాతపట్నం

ఎంతో ఉపయోగం



వివిధ పోటీ పరీక్షలకు కావాల్సిన మెటీరియల్ గ్రంథాలయంలో లభిస్తుంది. ఇంకా మెటిరియల్ అవసరమైతే తెప్పిస్తామని చెప్పారు. మాలాంటి వారికి ఎంతగానో ఉపయోగపడుతుంది.

– టి.దుర్గారావు, కాపుగోపాలపురం గ్రామం, పాతపట్నం

పోటెత్తిన భక్తులు



క్యూలో ఉన్న భక్తులు

పాతపట్నం: ఉత్తరాంధ్రుల ఆరాధ్యదైవం, పాతపట్నం గ్రామదేవత నీలమణిదుర్గ అమ్మవారి ఆలయం ఆదివారం భక్తులతో కిటకిటలాడింది. శ్రావణ మాసం సందర్భంగా అమ్మవారి ఆలయానికి తెల్లవారు జామునుంచే స్థానికులతోపాటు ఒడిశా ప్రాంతానికి చెందిన భక్తులు అధిక సంఖ్యలో తరలివచ్చారు.

అమ్మవారికి కుంకుమ, ప్రత్యేక పూజలు చేశారు. ఘటాలతో మొక్కులు చెల్లించారు. పలువురు వాహన పూజలు చేపట్టారు.

ప్రతి పనిలోనూ దైవం..



మాట్లాడుతున్న తోట అరుణ

ఆమదాలవలస: విద్యార్థులు, పిల్లలు తమ దైనందిన జీవితంలో ప్రతి పనిని దైవంగా భావించాలని రాష్ట్ర సత్య సాయి సేవా సంస్థల మహిళా విభాగం ఆధ్యాత్మిక కోఆర్డినేటర్ తోట అరుణ అన్నారు. ఆమదాలవలస జోన్ పరిధిలోని తాళ్లవలసలో గల కస్తూర్బా గాంధీ బాలికల విద్యాలయంలో ఆదివారం జోనల్ కన్వీనర్ ఎం.జనార్ధనరావు అధ్యక్షతన భక్తి పట్ల అవగాహన సదస్సు నిర్వహించారు. చిన్నప్పటి నుంచే మన సంస్కృతి, సంప్రదాయం, పద్ధతులను నేర్పించాలన్నారు. పిల్లలకు జీవిత కాలంలో ఎదురయ్యే సమస్యలకు కారణం, వాటి పరిష్కారం మార్గాలను వివరించారు.

ఈ కార్యక్రమంలో వేనమ్మపేట సత్యసాయి సేవా సమితి కన్వీనర్ సి.హెచ్.సూర్యారావు, బొబ్బిలిపేట భజన బృందం కన్వీనర్ చింతాడ అప్పారావు, పాఠశాల ఎస్ఓ పి.శిరీష, ఉపాధ్యాయురాలు గాయత్రి తదితరులు పాల్గొన్నారు.

కోటదుర్గమ్మకు ప్రత్యేక పూజలు



పూజల్లో పాల్గొన్న ఎమ్మెల్యే గోవిందరావు

ఎల్.ఎన్.పేట: ప్రతి ఒక్కరూ ఆధ్యాత్మిక భావాలను అలవాటు చేసుకోవాలని పాతపట్నం ఎమ్మెల్యే మామిడి గోవిందరావు అన్నారు. మండలంలోని పెద్దకోట గ్రామంలోని కోటదుర్గమ్మ సన్నిధిలో ఆదివారం జరిగిన పూజల్లో పాల్గొన్నారు. ఆధ్యాత్మిక భావాలను అలవాటు చేసుకోవటం వల్ల గ్రామస్తుల్లో మంచితనం పెరుగుతుందన్నారు. కూటమి నాయకులు, తదితరులు పాల్గొన్నారు.

శిథిలావస్థలో పాఠశాల భవనం



పైకప్పు పెచ్చులూడిన పాఠశాల భవనం

సారవకోట: మండంలోని రామకృష్ణాపురం ప్రాథమిక పాఠశాల భవనం పైకప్పు పెచ్చులూడుతుంది. ఈ భవనం పూర్తిగా శిథిలావస్థకు చేరుకుంది. వర్షాలు పడే సమయంలో మరింత ఇబ్బందిగా ఉందని విద్యార్థుల తల్లిదండ్రులు తెలిపారు. ఎప్పుడు పైకప్పు పెచ్చులూడి తలపై పడతాయోనని విద్యార్థులు భయాందోళన చెందుతున్నారు.

అసాంఘిక కార్యకలాపాలకు అడ్డా..



ఉపాధి కార్యాలయం మెట్లపై ఉన్న మద్యం సీసా

మెళియాపుట్టి: మండల కేంద్రంలోని శివారులో ఉన్న వెలుగు, ఉపాధి హామీ కార్యాలయం అసాంఘిక కార్యకలాపాలకు అడ్డాగా మారింతి. ఈ కార్యాలయాలకు ప్రక్కనే ప్రభుత్వ మద్యం దుకాణం నిర్వహిస్తున్నారు. అధికారులు విధులు నిర్వహించడానికి ఇబ్బంది పడుతున్నారు. వెలుగు కార్యాలయానికి నిత్యం డ్వాక్రా మహిళలు వస్తూ ఉంటారు. సాయంత్రం ఐదు గంటలు దాటితే కొంతమంది మద్యం సేవించి కార్యాలయాల వరండాలోనే పవళిస్తున్నారు. కార్యాలయాలకు చుట్టూ ప్రహరీ లేకపోవడంతో రాత్రి వేళల్లో అసాంఘిక కార్యకలాపాలు జరుగుతున్నట్లు గ్రామస్తులు చెబుతున్నారు. కార్యాలయాల వరండాలపైనే మద్యం సేవించి బాటిళ్లు పగులగొట్టి వెళ్లి పోతున్నారు. ప్రహరీ నిర్మించాలని ఉన్నతాధికారులను కోరనున్నట్లు ఏపీఎం లలిత, ఏపీఓ రవి తెలిపారు.

మున్సిపల్ మాజీ చైర్‌పర్సన్‌కు మాతృవియోగం



జయలక్ష్మి (ఫైల్)

ఆమదాలవలస: మున్సిపల్ మాజీ చైర్‌పర్సన్ తమ్మినేని గీత తల్లి జయలక్ష్మి ఆదివారం అనారోగ్యంతో మృతి చెందారు. రిటైర్డ్ జిల్లా జడ్జి బగాది కృష్ణారావు సతీమణి అయిన విజయలక్ష్మికి ఇద్దరు కుమార్తెలు, ఒక కుమారుడు ఉన్నారు. ఈమె కుమారుడు కల్యాణ్ చక్రవర్తి ప్రస్తుతం విజయనగరం జిల్లా జడ్జిగా విధులు నిర్వహిస్తున్నారు. ఈమె అంత్యక్రియలు సోమవారం ఉదయం 9 గంటలకు నిర్వహించనున్నట్లు కుటుంబ సభ్యుడు తమ్మినేని విద్యాసాగర్ తెలిపారు.

ముంపు ప్రాంతాలపై ప్రత్యేక శ్రద్ధ అవసరం



వ్యవసాయ అధికారి సురేష్

జలుమూరు: వంశధార నదీ పరివాహక గ్రామాలమైన కొమనాపల్లి, అచ్చుతాపురం, గుగ్గిలి, కూర్మనాథపురం, పాగోడు తదితర గ్రామాల రైతులు వరి పంటలపై ప్రత్యేక శ్రద్ధ తీసుకోవాలని మండల వ్యవసాయశాఖ అధికారి కె.సురేష్ సూచించారు. ఆదివారం ఆయా గ్రామాల్లోని పొలాలను పరిశీలించి రైతులకు సూచనలు చేశారు. బూస్టర్ డోస్ వేయడం ద్వారా వరి నాట్లు త్వరగా సాధారణ స్థితికి వస్తాయన్నారు. ఇతర సాంకేతిక సమస్యల కోసం ఆయా గ్రామ సచివాలయాల వ్యవసాయ అధికారులు, సిబ్బందిని సంప్రదించాలన్నారు.

పట్టపగలే విద్యుత్ వెలుగులు



పగలే వెలుగుతున్న వీధి దీపాలు

సారవకోట: మండలంలోని కిన్నెరవాడ గ్రామంలో వీధి దీపాలు పట్టపగలే వెలుగుతున్నాయి. నిత్యం ఇదే రీతిలో రాత్రీ, పగలు వెలుగుతుంటాయని గ్రామస్తులు తెలిపారు. గ్రామంలోనే సచివాయం ఉన్నా దీనిపై చర్యలు తీసుకునే దాఖలాలు లేవన్నారు.

గోతులు పూడ్చరూ..



సింగన్నపాలెం ప్రధాన రహదారిపై ఏర్పడిన గొయ్యి

బూర్జ: మండలంలోని పాలకొండ-ఆమదాలవలస ప్రధాన రహదారిపై సింగన్నపాలెం గ్రామం సమీపంలో ఏర్పడిన గోతులను పూడ్చాలని స్థానికులు కోరుతున్నారు. భారీ వాహనాలతో నిత్యం రద్దీగా ఉండే ఈ రహదారిపై గోతులు ఉండడంతో ప్రయాణికులు ఇబ్బంది పడుతున్నారు. ఆర్అండ్‌బీ అధికారుల స్పందించి తక్షణమే గోతులను పూడ్చాలని స్థానికులు, ప్రయాణికులు కోరుతున్నారు.

ఆదిత్యుని సన్నిధిలో రెవెన్యూ శాఖ ప్రిన్సిపల్ సెక్రటరీ

అరసవల్లి: అరసవల్లి సూర్యనారాయణ స్వామి వారిని కేంద్ర ప్రభుత్వ రెవెన్యూ విభాగ ప్రిన్సిపల్ సెక్రటరీ వై.వి.జె.రాజశేఖర్ ఆదివారం ఉదయం దర్శించుకున్నారు. ఆలయ ప్రధానార్చకులు ఇప్పిలి శంకరశర్మ ఆధ్వర్యంలో ఆయనకు ప్రత్యేక స్వాగతం పలికి అంతరాలయ దర్శనం చేయించి గోత్రనామాలతో పూజలు జరిపించారు. అనంతరం ఆలయ విశిష్టతను వివరించారు. అనివెట్టి మండపంలో వేదాశీర్వచనాన్ని అందించారు.

నిషేధమెక్కడ?



కిరాణా దుకాణాల్లో వేలాడదీసిన గుట్కా, ఖైనీ ప్యాకెట్లు

- బాహాటంగా గుట్కా విక్రయాలు
- పట్టించుకోని అధికారులు

పాతపట్నం:మత్తు పదార్థాల వల్ల కలిగే అనర్థాలపై ఓవైపు ప్రభుత్వం ప్రచారం చేయడమేగాకుండా పాన్, గుట్కా, ఇతర హానికరమైన పొగాకు ఉత్పత్తులను నిషేధించింది. మరోవైపు వీటిని బహిరంగంగానే కొందరు వ్యాపారులు విక్రయిస్తున్నా.. సంబంధిత అధికారులు అటువైపు చూడటం లేదు. ఆహార భద్రత చట్టం కింద-2006లో అప్పటి ప్రభుత్వం గుట్కాలు, ఖైనీలు ఇతర హానికరమైన పొగాకు ఉత్పత్తులను నిషేధించింది.

ఈ మేరకు జీవో కూడా జారీ చేసింది. ఒడిశా, ఆంధ్రా సరిహద్దు ప్రాంతం కావడంతో యువత మత్తు పదార్థాలకు అలవాటు పడుతున్నారు. ఈ నేపథ్యంలో పాతపట్నం నియోజకవర్గంలో మాత్రం వీటి వాడకం యథేచ్ఛగా సాగుతోంది. అధికారుల నిర్లక్ష్యాన్ని అలుసుగా తీసుకుంటున్న గుట్కా వ్యాపారులు ఇష్టారీతిన విక్రయిన్నారు. యువత కూడా వీటికి అలవాటు పడుతున్నారు.

బానిసవుతున్న యువత

ప్రధానంగా యువత గుట్కా, పాన్‌పరాగ్, ఖైనీలకు బానిసలవుతూ అనారోగ్యం పాలవుతున్నారు. కిడ్నీ, గుండె, కాలేయ వ్యాధులకు గురవుతున్నారు. చిన్న వయస్సులోనే మత్తు పదార్థాలకు అలవాటు పడి క్యాన్సర్ వంటి ప్రాణాపాయ రోగాలను కొనితెచ్చుకుంటున్నారు. యువకుల్లో 40 శాతం మంది వీటికి అలవాటు పడుతున్నారని వైద్యులు చెబుతున్నారు.

గుట్కాలతో అనారోగ్యం



పాన్‌పరాగ్, గుట్కా, ఖైనీ వంటి వాటిని అధికంగా నమలడం వల్ల గొంతు క్యాన్సర్, గుండె జబ్బులు వచ్చే అవకాశముంది. యువకులు వీటికి దూరంగా ఉండాలి. చిన్న వయస్సులో వీటి బారినపడకుండా చూడాల్సిన బాధ్యత తల్లిదండ్రులపై ఉంది.

-ఎస్.కృష్ణారావు, సూపరింటెండెంట్, పాతపట్నం సీహెచ్‌సీ

హైవే గుబులు!



పెద్దపాడు రూరల్ పోలీస్ స్టేషన్ సమీపంలో హైవేపై ఇలా..

హైవేపై ప్రయాణం ప్రమాదంగా ఉంది. పోలీసు అధికారులు ఎన్ని హెచ్చరికలు చేస్తున్నా, అవగాహన కల్పిస్తున్నా వాహనాల డ్రైవర్లలో మార్పురావడం లేదు. ఓవర్ లోడింగ్‌తో ఉండే భారీ వాహనాలను నగర, పట్టణ, ముఖ్య కూడళ్ల సమీప హైవేల వెంబడి ఫ్లైఓవర్లపైన, దిగువున, సర్వీస్ రోడ్డులో గంటల తరబడి పార్కింగ్ చేస్తున్నారు. రాత్రి వేళల్లో కనీసం సైడ్ ఇండికేటర్ సిగ్నల్స్ కూడా కొందరు వేయకుండా వాహనాలను నిలిపి ఉంచుతున్నారు. దీంతో ఆ సమయంలో ప్రయాణించేవారు ఏమాత్రం నిర్లక్ష్యంగా ఉన్నా ప్రమాదాలు జరిగే ఆస్కారముందని ప్రజలు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. రాత్రి వేళ హైవే గస్తీని ముమ్మరం చేసి ఇలాంటి వాహనాలపై పోలీసులు చర్యలు చేపట్టాలని కోరుతున్నారు.

-శ్రీకాకుళం క్రైమ్



ఫ్లై ఓవర్ కింద ఇలా పార్కింగ్ చేస్తే వాహనాలు వెళ్లేది ఎలా?



సర్వీస్ రోడ్డులో ఓవర్ లోడ్ వాహనాలు పార్కింగ్ చేసి ఉండడంతో ట్రాక్టర్ మలుపు తిరుగుతూ..

ఉత్తమ సమాజ నిర్మాణమే ధ్యేయం

శ్రీకాకుళం అర్బన్: ఉత్తమ సమాజ నిర్మాణమే మానవత స్వచ్ఛంద సేవా సంస్థ ధ్యేయమని నూతన అధ్యక్షులు పొన్నాడ రవికుమార్ అన్నారు. శ్రీకాకుళం పట్టణంలోని ఓ ప్రైవేటు అతిథిగృహంలో సేవా సంస్థ నూతన కార్యవర్గ ప్రమాణ స్వీకార కార్యక్రమం ఆదివారం జరిగింది. అధ్యక్షులుగా రవికుమార్, సెక్రటరీగా శ్రీనివాసరావు, కోశాధికారిగా సింగూరు ప్రవీణ్ లు ప్రమాణ స్వీకారం చేశారు. అనంతరం రవికుమార్ మాట్లాడుతూ.. తన సేవా సంస్థ కులమతాలకు అతీతంగా సేవా కార్యక్రమాలు చేస్తోందన్నారు. మొక్కల పెంపకం, ప్లాస్టిక్ వాడకం తగ్గించడం, రక్తదాన శిబిరాలు, ప్రతిభావంతులైన పేద విద్యార్థులకు ప్రోత్సాహకాలు, అంబులెన్స్ సేవలు అందిస్తామన్నారు. అలాగే ఉచిత వైద్య శిబిరాల నిర్వహణ, మార్చురీ ఫ్రీజర్లు, పార్థివదేహాలకు శాంతి రథలను సమకూర్చడం వంటి సేవా కార్యక్రమాలను చేపట్టనున్నట్లు పేర్కొన్నారు. కార్యక్రమంలో రెడ్‌క్రాస్ చైర్మన్ పి.జగన్మోహనరావు, విశ్రాంత జాయింట్ కలెక్టర్ రజనీకాంత్, విశ్రాంత డీఎస్పీ భార్గవనాయుడు, బి.లక్ష్మణరావు, సుమతి, రెడ్డి, మానవతా స్వచ్ఛం సేవా సంస్థ చైర్మన్ డి.విష్ణుమూర్తి, సంస్థ వైస్ చైర్మన్ నటుకుల మోహన్, టూరిజం అధికారి నారాయణరావు, సెట్‌శ్రీ సీఈఓ ప్రసాదరావు, టి.రాంగోపాల్ టి.అప్పలనాయుడు, కొమ్ము రమణమూర్తి, కోరాడ హరగోపాల్ ఉన్నారు.